క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు గోపాల్‌యాదవ్ రాజీనామా



జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్): జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ గోపాల్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ పద్మజ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీలో ఉండి పార్టీకి అన్నివిధాల సేవ చేసినట్లు తెలిపారు. గతంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నాయకత్వంలో పని చేసినట్లు ఇన్నిరోజులు తమకు సహకరించిన పార్టీ నాయకత్వం, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి లేఖ రాశారు. అనివార్య కారణాలతో పార్టీకి సేవ చేయలేకపోతున్నామని అందుకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

మహమ్మదాబాద్: మండలంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ, 11గంటలకు ఆముదాలగడ్డతండా సీసీరోడ్డు ప్రారంభం, నంచర్ల జీపీ భవనం ప్రారంభం, దేశాయిపల్లి, జూలపల్లి, సంగాయపల్లి, కొలిమికుచ్చతండా, ధర్మాపూర్, వెంకట్‌రెడ్డిపల్లి, ముందలితండా, షేక్‌పల్లిలో సీసీరోడ్డు ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కులదురహంకారానికి నిదర్శనం

- సీఎం ప్రసంగాన్ని ఖండించిన బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మూడు రోజులక్రితం కొల్లాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బట్టలు ఉతికే జాతికి చెందిన వీర్లపల్లి శంకర్‌ని షాద్‌నగర్ ఎమ్మెల్యేను చేశామని.. చేపలు పట్టుకునే వాకిటి శ్రీహరిని ఈయాల మంత్రిని చేశానంటూ ప్రసంగించడం దురహంకారానికి నిదర్శనమని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. సీఎం హోదాలో ఉండి ఇలా సహచర ఎమ్మెల్యేలను కులం పేరుతో సంబోధించకుండా వాళ్ల వృత్తిని చెప్పి మాట్లాడడం బీసీ సమాజానికి జరిగిన అవమానంగా భావిస్తున్నట్లు తెలిపారు. బీసీ కులాలకు చెందిన ప్రజాప్రతినిధులను ఇలా మాట్లాడడం వాళ్ల మనోభావాలను దెబ్బతీయడమేనని తెలిపారు.

ఇంటి విషయంలో గొడవ: కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని కల్మన్‌కల్వకు చెందిన గోపాల్ నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. కాగా ఇంటికి ఆనుకొని జంబులయ్య ఇల్లు ఉంది. తన ఇంటి నిర్మాణం విషయంలో జంబులయ్య ఇంటిపై నుంచి వాననీరు వచ్చి ఇంటి నిర్మాణానికి ఇబ్బందులు వస్తున్నాయని గోపాలు జంబులయ్యకు చెప్పి నీళ్ల రాకుండా సిమెంట్‌తో అడ్డుకట్ట వేశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ విషయంలో ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

నవాబుపేట: తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ గిరిజన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని కిష్టంపల్లికి చెందిన మమతకు నాలుగు సంవత్సరాల క్రితం నాగమ్మగడ్డకు చెందిన రమేశ్‌నాయక్‌తో వివాహమైంది. కాగా నాటినుంచి బాగానే ఉన్నా ఇటీవల తన భర్తతోపాటు ఇతర కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని, రెండు వారాల క్రితం ఇంటి నుంచి వెల్లగొట్టారని బాధితురాలు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎంత చెప్పిన వారు వినకపోవడంతో సోమవారం భర్తతోపాటు ఇతర కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయమై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



దాసరిగాని మల్లేశ్(ఫైల్)

రాజాపూర్: బాలానగర్ మండలంలోని చిన్నరేవల్లికి చెందిన అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరిగాని మల్లేశ్‌కు ఈనెల 9న ఇంటినుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య జ్యోతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

‘సామాజిక’ సందేహం



సామాజిక తనిఖీ వివరాలను పొందుపరిచే పనుల్లో నిమగ్నమైన సోషల్ ఆడిట్ బృందం

- 10వేలకుపైగా జాబ్‌కార్డులకు పదిరోజుల్లోనే తనిఖీ
- సోషల్ ఆడిట్ బృందం పరిశీలనపై అనుమానాలు
- ‘ఉపాధి’ పనుల అవకతవకలపై నిజాలు తేలేనా..?
- నేడు మండల పరిషత్‌లో బహిరంగ సభ

హన్వాడ: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై సర్వత్రా సందేహం నెలకొంది. మండలంలో ఉపాధి చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందం చేపట్టిన తనిఖీపై అనుమానాల వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పనుల అవకతవకలపై నిజాలు బయట పడుతాయా లేదా అంటూ పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 2024–25 సంవత్సరానికిగానూ మంజూరైన ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించింది. మండలంలో ప్రారంభమైన సామాజిక తనిఖీ నేటికీ పదిరోజులు కావస్తుంది. ఈ తనిఖీల్లో గత ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయిన పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహించి పనులపై ఆరా తీశారు. ఎవరెవరు ఎంతెంత పని చేశారు.. నిజమైన జాబ్‌కార్డుదారేనా.. అతని పేరుపై ఇంకొకరు పనిచేశారా..? లేక పనిచేయకుండానే పనులు చేసినట్లు ఫోర్జరీ సంతకాలు పెట్టి నిధులు కాజేశారా..? అనే అంశాలపై సామాజిక బృందం నిజాలు రాబట్టారు. పనులు.. కూలీల వివరాలు తెలుసుకుని నేరుగా కూలీలను ప్రశ్నించగా.. గుడ్డిమల్కాపూర్‌లో ఓ కూలీ తాను పనిచేయందే చేసినట్లు ఉండటాన్ని సదరు మహిళ స్థానిక ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఖంగుతిన్న సామాజిక బృందం దీనిపై ఎలాంటి విచారణ చేశారు.. ఎలాంటి నివేదికలు బహిరంగ సభలో ప్రవేశ పెడుతారనేది తేలాల్సి ఉంది. ఇలాంటి ఘటనలు మండలంలో ఎన్ని వెలుగు చూశాయి.. అవన్నీ బహిర్గతమవుతాయా..? అనేది అనుమానాస్పదంగా ఉంది.



ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

స్వల్ప వ్యవధిలోనే తనిఖీ పూర్తి

శ్యాట్ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలోని సోషల్ ఆడిట్ బృందం మండలంలో పదిరోజుల్లో ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీకి వచ్చింది. ఓఎస్‌ఆర్‌పీ, 12మంది డీఆర్‌పీలు, వీఆర్‌పీలతో కలిసి మొత్తం 30మందిదాక వచ్చిన సోషల్ ఆడిట్ బృందం మండలంలో ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీలు చేశారు. ఒక్క హన్వాడలోనే దాదాపు 17వందలకు పైగా జాబ్‌కార్డులున్నాయి. మరి ఇందులో ఎంతమంది పనిచేశారు.. వారిలో ఎందరికి చేసిన పనులకు డబ్బులు రాలేదనేది తేల్చాల్సిన ఆడిట్ బృందం మూడురోజుల్లోనే పూర్తి చేశారనడంపై పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌లు లేని సమయంలో అన్నీతానై వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భైలెల్లిన పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మిడ్జిల్: మండలంలోని వేములలో గ్రామదేవత పోచమ్మ బోనాలను సోమవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను అందంగా అలంకరించుకొని ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకున్నారు. ఆలయం ప్రదక్షిణ చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వానలు సమృద్ధిగా కురువాలని.. పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఆలయం దగ్గర గ్రామపెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అన్నిపార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి చల్లంగా చూడమ్మా

నవాబుపేట: పోచమ్మతల్లి చల్లంగా చూడమ్మా అంటూ గ్రామదేవతలకు మండలంలోని దేపల్లి ప్రజలు బోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్‌గౌడ్, రాములు, రమేశ్, రాజు, శ్రీనివాస్, దశరథం శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రాజు, శ్రీశైలం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



దేపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తునన మహిళలు

పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



సురేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

హన్వాడ: అధిష్ఠానం సూచించిన అభ్యర్థి గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్ సూచించారు. సోమవారం మండలంలోని టంకరలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భవిష్యత్‌లో పార్టీ పూర్వవైభవానికి నాంది పలకాలని కోరారు. ఎంపీటీసీ సెగ్మెంట్ వారీగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపులో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు సురేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ కృష్ణయ్యయాదవ్, మండల అధ్యక్షుడు మహేందర్, మాజీ సర్పంచ్ అచ్చన్న, నాయకులు బాలయ్య, జాంగీర్, తిరుపతయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కుల పంపిణీ



నోట్‌బుక్కులు అందజేస్తున్న కోన రాజశేఖర్

దేవరకద్ర రూరల్: మండలంలోని చిన్నరాజమూర్‌లో విద్యార్థులకు సోమవారం జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గద్మలి శ్రీనివాస్ గ్రామంలోని విద్యార్థులందరూ చక్కగా చదువుకోవాలన్న ఉద్దేశంతో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ట్యూషన్ ఏర్పాటు చేశారు. ఆ విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందించాలని రాజశేఖర్‌ను అడగగా వెంటనే స్పందించి 50మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం’

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తమ సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. 5,571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ప్రకటించాలని, డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తింపజేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఈ డిమాండ్లను సాధించేందుకు మొదటి దశగా ఈనెల 23, 24వ తేదీల్లో ఆయా మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. రెండోదశలో వచ్చే నెల 1న కలెక్టరేట్ వద్ద ధర్నా, మూడో దశలో ఆగస్టు 23న ‘చలో హైదరాబాద్’ చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రవికుమార్, వెంకటేశ్, రవీందర్‌గౌడ్, ప్రభాకర్, మహమూద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో యూరియా పంపిణీ



నవాబుపేట సహకార కార్యాలయంలో యూరియా కోసం క్యూలైన్లు

నవాబుపేట: మండల కేంద్రంలో యూరియా క్యూలైన్లు సోమవారం సైతం కొనసాగాయి. సహకార సంఘం కార్యాలయంతోపాటు ఆగ్రో కేంద్రాల్లో సోమవారం యూరియాను అందుబాటులో ఉంచారు. దీంతో పోలీసుల పహారాలో రైతులు క్యూలు కట్టి యూరియాను తీసుకెళ్లారు. కాగా రైతుకు ఆధార్, పాస్ బుక్కుపై కేవలం ఒక్కరోజు 2బస్తాల యూరియా మాత్రమే ఇస్తుండడంతో చాలామంది రైతులు క్యూలు కట్టాల్సి వచ్చింది. రోజువారీగా యూరియా సరఫరా అవుతుండడంతో ప్రతిరోజు స్టాకు ఉన్నంతవరకు యూరియాను అందించి ముగిస్తున్నారు. దీంతో చాలా మంది తమకు అందడం లేదంటూ వాపోతున్నారు. యూరియా కేంద్రాలు తెరవగానే రైతులు ఎగబడడంతో కేంద్రాల చెంత పోలీసుల పహారా విధిగా అవసరం వచ్చింది.



పోలీసుల పహారాలో యూరియా సరఫరా చేస్తున్న నవాబుపేట ఆగ్రో కేంద్రం నిర్వాహకులు

జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మక్తల్: హైదరాబాద్‌లోని బండ్లగూడ, నాగోల్ వాటర్ గ్రౌండ్‌లో ఈ నెల 20న జరిగిన అస్మిత ఖేల్ ఇండియా ఉమెన్స్ రోడ్ స్పీడ్ సైక్లిలింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన 150 మంది పాల్గొనగా 79 మంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారని జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. ఆగస్టు చివరి వారంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు పుష్ప, శిల్ప, లావణ్య, మంజుల, త్రివేణి, పవిత్ర, దివ్య, అనూష, గిరిజ, మల్లేశ్వరి, అంకిత, రేణుక పాల్గొన్నారు.



అప్పంపల్లి బస్టాండ్ సమీపంలో బురదమయంగా మారిన రోడ్డు

చిరుజల్లులకే చిత్తడి

కొత్తకోట మండలం అప్పంపల్లి బస్టాండ్ వద్ద చినుకుపడితే చాలు రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. ఆత్మకూర్, దేవరకద్ర పటణాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదివరకు అక్కడ బీటీ రోడ్డుకు గుంతలు ఏర్పడడంతో అధికారులు రోడ్డు వేసేందుకు గతేడాది రోడ్డును తొలగించి మట్టిని పరిచారు. దీంతో ఆదివారం కురిసిన వర్షానికి అక్కడ రోడ్డంతా బురదమయంగా మారి వాహనదారులకు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మించి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– చిన్నచింతకుంట

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

జడ్చర్ల: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సింగిదాస్ యాదమ్మ కూతురు లక్ష్మీనర్సమ్మ(25)కు ఆలూరు చెందిన బుర్ర కృష్ణయ్యకు 4 సంవత్సరాల క్రితం వివాహమైంది. అతడు 2సంవత్సరాల క్రితం మృతి చెందాడు. లక్ష్మీనర్సమ్మ తల్లి వద్దే ఉంటోంది. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చెప్పకుండ వెళ్లిపోయింది. బంధువుల చెంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినటు బాధితురాలు వివరించింది.

సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకురావాలి



మాట్లాడుతున్న సీఐ నాగార్జునగౌడ్

మిడ్జిల్: సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సీఐ నాగార్జునరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఇటీవల మండలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయని, ఎక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో కేసులను ఛేదించుటకు ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు వ్యాపారులు, గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలను సీసీ కెమెరాల ఆధారంగా త్వరగా గుర్తించేందుకు వీలుంటుందన్నారు. గ్రామంలో వ్యాపారులు, గ్రామపెద్దలు కమిటీ వేసుకొని వాటి నిర్వాహణ చేపట్టాలని కోరారు. సీఐ సూచన మేరకు వ్యాపారులు సహకరిస్తామని తెలిపారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి



అంబటోనిపల్లి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

హన్వాడ: మండలంలోని అంబటోనిపల్లిలో హన్వాడ–వేపూర్ ప్రధాన రహదారిపై రైతు సంఘం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా మండలంలో 13వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తారని.. ఇందుకు సరిపడేంత యూరియా, డీఏపీలు అందించాల్సిన ప్రభుత్వం కేవలం 100టన్నుల యూరియా, 40టన్నుల డీఏపీ సరఫరా చేసిందన్నారు. నిజానికి మండలంలో 16.80టన్నుల యూరియా, 610టన్నుల డీఏపీ అవసరమన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులను వెంటనే సరఫరా చేయనిపక్షంలో రైతుల పక్షాన నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు కుర్మయ్య, రాములు, వెంకటమ్మ, రమణయ్య, రేఖమయ్య, తిరుమల్‌రెడ్డి, శేఖర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరనిలోటు



జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్ నగర్ న్యూటౌన్: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీపీఎం జిల్లా శాఖ తరఫున సంతాపం ప్రకటించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు కిల్లె గోపాల్ మాట్లాడుతూ.. అచ్యుతానందన్ మూర్తి సీపీఎం జాతీయ పార్టీకి, కేరళ రాష్ట్రానికి తీరని లోటన్నారు. సీపీఎం నేతగా పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. కేరళ ముఖ్యమంత్రి, కామ్రేడ్ అచ్యుతానందన్ ఆశయాల సాధనకు కృషిచేయాలని, ఆయన పనితీరును సీపీఎం కార్యకర్తలు మార్గదర్శకంగా తీసుకొని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కడియాల మోహన్, రాజ్ కుమార్, భరత్, సురేశ్, భాస్కర్ అంజి, రమేశ్, శివ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మొక్కల పంపిణీ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యగౌడ్ ఉపాధ్యాయులకు మొక్కల పంపిణీ చేశారు. సోమవారం స్థానిక వారి నివాసంలోని నందనవనంలో ఉపాధ్యాయులకు మొక్కలు పంపిణీ చేశారు. పర్యవరణాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

ఆయుర్వేదం.. దైన్యం

- నిరుపయోగంగా ఆస్పత్రి
- ప్రజలకు అందని వైద్యసేవలు
- శిథిలావస్థకు చేరిన భవనం, చుట్టూ ముళ్లపొదలు



చిన్నచింతకుంటలో నిరుపయోగంగా ఆయుర్వేద ఆస్పత్రి

చిన్నచింతకుంట: దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం ఎంతో ఉపయోగకరమని ప్రజల నమ్మకం. అలాంటి ఆయుర్వేద వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండాపోయింది. గత ప్రభుత్వంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనంలో ఆయుర్వేద ఆస్పత్రిని కొనసాగించారు. అయితే మండల ప్రజలు ఆయుర్వేద వైద్య సేవలు వినియోగించుకొని ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రి మూతపడడంతో మండల ప్రజలు వైద్యానికి నోచుకోలేకపోతున్నారు. దీంతో కొందరు సమీప ప్రాంతాల్లో నాటువైద్యం చేయించుకుంటున్నారు. మరికొందరు దూరప్రాంతాలకు వెళ్లి ఆయుర్వేద ఆస్పత్రిలో చికిత్సను పొందుతున్నారు.

అందుబాటులోలేని వైద్యం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యసేవలు నిలిచిపోవడంతో అధికారులు మందులు, సామగ్రిని అధికారులు తీసేశారు. దీంతో ఆస్పత్రి నిరుపయోగంగా మారింది. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు అములుకున్నాయి. ఆస్పత్రి ఆవరణలో విష సర్పాలు సంచరిస్తున్నాయి. గ్రామస్తులు, పీహెచ్‌సీకి వచ్చే రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఆయుర్వేద ఆస్పత్రిని కొనసాగించాలని, శిథిలావస్థ భవనాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వైద్య సేవలు కొనసాగించాలి



ఆయుర్వేద ఆస్పత్రిని కొనసాగించాలి. ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయి. గతంలో ఆస్పత్రి కొనసాగినప్పుడు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎంతోమంది వచ్చి వైద్యసేవలు పొందారు. నేను కూడా గ్యాస్ ట్రబుల్‌కు మందులు వాడగా పూర్తిగా నయమైంది.

– మధు, చిన్నచింతకుంట